సాక్షి
మెదక్
సోమవారం । 27 । జనవరి । 2025



వీరికి పండుగ.. వారికి దండగ

ప్రస్తుతం టమోటా ప్రజలకు పండుగ కాగా రైతులకు దండగ అన్నట్లు ఉంది పరిస్థితి.

వివరాలు 8లో ▸



మానవత్వానికి ప్రోత్సాహకం

రోడ్డు ప్రమాద బాధితులను కాపాడిన వారి కోసం కేంద్రం గుడ్ సమారిటన్ పథకం తీసుకొచ్చింది.

వివరాలు 8లో ▸



ఉత్తమ సేవలకు గుర్తింపు

ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన 88 మంది అధికారులకు ఉత్తమ అవార్డులు దక్కాయి.

వివరాలు 9లో ▸

అభివృద్ధిలో అగ్రగామి

జిల్లాలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- మహానుభావుల కలలు నిజం చేద్దామని పిలుపు
- పరేడ్‌గ్రౌండ్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు

మెదక్‌జోన్: అభివృద్ధిలో జిల్లాను అగ్రగామిగా నిలుపుతామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. ఎందరో మహనీయుల త్యాగఫలంగా సిద్ధించిన స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలన్నారు. అప్పుడే రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తి నెరవేరుతుందని అన్నారు. ప్రజాపాలనలో భాగంగా నాలుగు పథకాలకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా సర్వే చేపట్టారని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు కోటి 83 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని, వారికి రూ. 62.44 కోట్ల లబ్ధి చేకూరిందని వివరించారు. గృహజ్యోతి కార్యక్రమంలో భాగంగా అర్హులకు 200 యూనిట్లలోపు విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వడంతో జిల్లాలో ఇప్పటివరకు 1,26,536 మంది వినియోగదారులకు రూ. 41.69 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం అందజేసిందని చెప్పారు.



ప్రసంగిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

అన్నదాతకు భరోసా

రైతు భరోసా ద్వారా అర్హులైన రైతులకు ఎకరాకు రూ. 5 వేల చొప్పున 2023- 24 యాసంగిలో 2,63,933 మంది రైతుల ఖాతాల్లో రూ. 194.54 కోట్ల పెట్టుబడి సాయం అందించినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే నేటి నుంచి ఈ పథకం ద్వారా వ్యవసాయ యోగ్యమైన సాగు భూములకు ఏడాదికి ఎకరాకు రూ. 12 వేల చొప్పున ప్రతి సీజన్‌కు రూ. 6 వేల పెట్టుబడి సాయం అందనున్నట్లు వివరించారు. అలాగే దేశంలో ఎప్పుడూ లేని విధంగా రూ. 2 లక్షల వరకు ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసి ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. జిల్లాలో 82,294 మంది రైతులకు రూ. 604.21 కోట్ల రుణ మాఫీ చేసినట్లు తెలిపారు. అలాగే 2024- 25 వానాకాలం సీజన్‌లో రైతుల నుంచి 2,37,603 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం, 53,659 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం సేకరించినట్లు చెప్పారు. ఇందుకోసం రూ. 675.73 కోట్లను 70,977 మంది రైతులకు ఖాతాలో జమ చేశామన్నారు. అలాగే సన్నాలకు సంబంధించి 12,872 రైతులకు బోనస్ కింద క్వింటాల్‌కు రూ. 500 చొప్పున రూ. 26.83 కోట్లు అదనంగా జమ చేసినట్లు వివరించారు.

విద్యకు పెద్దపీట

జిల్లాలో 562 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా రూ. 20.62 కోట్లతో మౌలిక వసతులను కల్పించామన్నారు. పాఠశాలల్లో సౌకర్యాల కోసం రూ. 1.52 కోట్లు ఖర్చు చేశామన్నారు. అలాగే మైనారిటీ, ఇతర రెసిడెన్షియల్ పాఠశాలల్లో డైట్ చార్జీలతో పాటు కాస్మోటిక్ చార్జీలను పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా పింఛన్లు, అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం, వైద్యారోగ్యశాఖ ద్వారా రోగులకు నాణ్యమైన వైద్యం అందించి జిల్లాను ముందువరుసలో నిలుపుతున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అధికారులు

పేదలకు కార్పొరేట్ వైద్యం

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసి రూ. 10 లక్షల వరకు పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకంలో భాగంగా జిల్లావ్యాప్తంగా 14,989 మంది పేదల వైద్యానికి సంబంధించి ప్రభుత్వం రూ. 36.85 కోట్లు ఖర్చు చేసిందన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం జిల్లావ్యాప్తంగా సుమారు 1,91,100 మంది దరఖాస్తు చేసుకోగా.. ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా అధికారులు సర్వే చేశారని తెలిపారు. ఈ పథకాన్ని ఆదివారం మండలానికో గ్రామంలో ప్రారంభించినట్లు వివరించారు. అలాగే 1,25,998 మంది వినియోగదారులకు సబ్సిడీ సిలిండర్ కోసం ప్రభుత్వం రూ.10. 96 కోట్లు అందజేసిందన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మెదక్ కలెక్టరేట్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు దేశభక్తి గీతాలు, రైతులు, సైనికులు, వైద్యుల గొప్పతనాన్ని తెలుపుతూ నృత్యాలు ప్రదర్శించారు. అలాగే డ్రగ్స్, మత్తు పదార్థాల నిర్మూలన, సైబర్ నేరాలపై నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులను అధికారులు అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆయా శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధి పథకాలను తెలుపుతూ శకటాలను ప్రదర్శించారు. అలాగే కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ నగేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ భుజంగరావు, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు, వివిధశాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అర్హులకు సంక్షేమ ఫలాలు: జెడ్పీ సీఈఓ



మహిళకు పథకాల మంజూరు పత్రం అందజేస్తున్న అధికారులు

తూప్రాన్: నాలుగు సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందజేస్తామని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. ఆదివారం మండలంలోని ఇమాంపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులకు వివిధ పథకాలకు సంబంధించిన పత్రాలు అందజేశారు. పథకాలు అందనివారు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని, అర్హులను గుర్తించి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషాద్రి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీఓ సతీష్, డీటీ శ్రీకాంత్, ప్రభుదాస్, ఏఈపీఆర్ మధు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులను బెదిరిస్తే సహించేది లేదు



సీఎం రేవంత్‌రెడ్డి కటౌట్‌కు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): నియోజకవర్గంలోని అధికారుల పట్ల ఎమ్మెల్యే సునీతారెడ్డి దురుసుగా ప్రవర్తిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి అన్నారు. ప్రజాపాలనలో భాగంగా ఆదివారం ప్రభుత్వం నాలుగు పథకాలను ప్రారంభించినందుకు వెల్దుర్తిలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి కటౌట్‌కు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ధనం కేసీఆర్ కుటుంబం దోచుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి వినియోగిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, నర్సింహారెడ్డి, శంకరయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రేగోడ్(మెదక్): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తోందని పీసీసీ సభ్యుడు కిషన్ అన్నారు. మండలంలోని గజ్వాడలో ఆదివారం నాలుగు పథకాలను అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి దామోదర రాజనర్సింహ కృషితో జిల్లాలోనే అత్యధికంగా గ్రామానికి 272 ఇందిరమ్మ గృహాలు మంజూరు అయ్యాయని చెప్పారు. త్వరలోనే రూ. రెండు లక్షలకు పైగా ఉన్న రైతుల రుణాలు మాఫీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మల్లేశం, తహసీల్దార్ నరేశ్, ఎంపీడీఓ సీతారావమ్మ, ఏఓ జావిద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారి

మెదక్‌జోన్: జిల్లాలోని మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం ఆదివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ (ఏసీఎల్‌బీ)ను నాలుగు మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారి నియమిస్తూ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకూడదండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

మాది ప్రజల ప్రభుత్వం

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

రామాయంపేట(మెదక్): మాది ప్రజా ప్రభుత్వమని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. ఆదివారం రామాయంపేటలో కూరగాయల మార్కెట్‌తో పాటు చిత్తారమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అంతకుముందు దామ రచెరువులో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నాలుగు పథకాలను ప్రారంభించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామాయంపేట అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానని, గత ప్రభుత్వం అభివృద్ధిని ఎంతమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల ఆలయ ప్రగతిని వదిలేశారని ఆరోపించారు. అనంతరం రామాయంపేట కూరగాయల మార్కెట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా వ్యాపారులు ఎమ్మెల్యేను కూరగాయల దండతో సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్

మా పాలనలో ప్రగతి పరుగులు

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పల్లెలు, పట్టణాలు, మున్సిపాలిటీలు గణనీయంగా అభివృద్ధి సాధించాయని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి అన్నారు. పదవీ కాలం ముగిసిన మున్సిపల్ కౌన్సిలర్లకు ఆదివారం పార్టీ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా పద్మారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లలో కేసీఆర్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలు, గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. 2014 ముందు మెదక్ మున్సిపాలిటీలో నీటి సమస్య ఉండేదని, మిషన్ భగీరథ ద్వారా నీరు అందిస్తున్నామని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థలు, మున్సిపాలిటీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. అంతకుముందు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కౌన్సిలర్లతో పద్మారెడ్డి, ఎమ్మెల్యే సునీతారెడ్డి

‘ఆత్మీయ భరోసా’తో పేదలకు మేలు

అదనపు కలెక్టర్ నగేష్

చిన్నశంకరంపేట(మెదక్): ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో నిరుపేదలకు మేలు జరుగుతుందని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. ఆదివారం మండలంలోని మిర్జాపల్లితండాలో నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ధృవపత్రాలు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియని తెలిపారు. ఎవరైన అర్హుల పేర్లు రాకపోతే అధికారులు విచారించి న్యాయం చేస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దామోదర్, తహసీల్దార్ మన్నన్, ఏపీఓ రాజ్‌కుమార్, గ్రామ కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

‘ప్రజా సంక్షేమానికి కృషి’



లబ్ధిదారులకు మంజూరు పత్రం అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట(మెదక్)/హవేళిఘణాపూర్: ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆదివారం మెదక్ మండలం బాలనగర్‌లో నాలుగు పథకాలను లాంఛనంగా ప్రారంభించారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి మాట్లాడారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేందుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అలాగే పాపన్నపేట మండల పరిధిలోని పొడ్చన్‌పల్లి తండాలో లబ్ధిదారులకు ధృవపత్రాలు అందజేశారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్పీఓ సురేష్‌బాబు, ఎమ్మార్వో సతీష్ కుమార్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు గోవింద్ నాయక్, ప్రశాంత్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, శ్రీనివాస్, గౌస్, నాని పాల్గొన్నారు.

‘లష్కర్’కు పోటెత్తిన భక్తజనం

మల్లన్న నామస్మరణతో మారుమోగిన కొమురవెల్లి క్షేత్రం

కొమురవెల్లి మల్లన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. రెండో ఆదివారం (లష్కర్ వారం) భక్తులు భారీగా తరలివచ్చారు. మల్లన్న నామస్మరణంతో ఆలయ పరిసరాలన్నీ మారుమోగాయి. సంక్రాంతి తర్వాత వచ్చే రెండో ఆదివారాన్ని లష్కర్ వారంగా భావిస్తారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, జిల్లాలనుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలనుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. స్వామివారి దర్శనం అనంతరం గంగరేణి చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి వివిధ రకాల పుష్పాలు, డ్రై ఫ్రూట్స్‌తో ప్రత్యేకంగా అలంకరించారు.

- కొమురవెల్లి(సిద్దిపేట)





రాజగోపురం ఎదుట భక్తుల కోలాహలం

వాగ్వాదాలు.. తోపులాటలు

కొత్త పథకాల పంపిణీలో రసాభాస

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాలుగు కొత్త పథకాల పంపిణీ రసాభాసగా సాగింది. ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ నాయకుల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. ఇరుపార్టీల నాయకుల తోపులాటలు, వాగ్వాదాలతో అట్టుడికింది. ఆదివారం నర్సాపూర్ మండలంలోని ఖాజీపేటలో కొత్త పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ జోక్యం చేసుకొని మీరు అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్కరికి సంక్షేమ పథకాలు ఇవ్వలేదని అన్నారు. దీంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక మహిళ ఎమ్మెల్యే అని చూడకుండా అగౌరవంగా మాట్లాడడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆంజనేయులు గౌడ్‌పై సుమోటోగా కేసు నమోదు చేయాలని, లేదంటే స్వయంగా ఫిర్యాదు చేస్తానని పోలీసులను ఆదేశించారు. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య తోపులాట జరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఎస్సై లింగం సిబ్బందితో కలిసి ఇరువర్గాలను శాంతింపజేశారు. అనంతరం ఎమ్మెల్యే లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఆర్డీఓ మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ మధులత, మండల వ్యవసాయ అధికారి దీపిక, డిప్యూటీ తహసీల్దార్ మహేష్, ఆర్‌ఐ సిద్దిరామిరెడ్డి, కార్యదర్శి బషీర్, నాయకులు సుధాకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఖాజీపేటలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య తోపులాట

సునీతారెడ్డి వర్సెస్ సుహాసినిరెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకటాపూర్(ఆర్)లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే సునీతారెడ్డి మంజూరు పత్రాలు పంపిణీ చేస్తుండగా.. కొద్దిసేపటికి అక్కడికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి వచ్చారు. ఎమ్మెల్యే ఓ వైపు లబ్ధిదారుల పేర్లు చదువుతూ మంజూరు పత్రాలు పంపిణీ చేస్తుండగా సుహాసినిరెడ్డి తాను పంపిణీ చేస్తానని మంజూరు పత్రాలు తీసుకున్నారు. ఎమ్మెల్యేగా తాను ఉండగా నువ్వు ఎలా పంపిణీ చేస్తావంటూ ప్రశ్నించారు. దీంతో ఇద్దరు మైక్‌లు తీసుకుని లబ్ధిదారుల పేర్లు చదివి మంజూరు పత్రాలు పంపిణీ చేసేందుకు సిద్ధం అయ్యారు. దీంతో ఎమ్మెల్యే అధికార పార్టీ నాయకులు మాత్రమే పంపిణీ చేస్తారంటూ నేను వెళ్లిపోతున్న అనగానే గ్రామస్తులు పలువురు ఎమ్మెల్యే పంపిణీ చేయాలని కోరగా తిరిగి పంపిణీ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం మిగిలిన పత్రాలను సుహాసినిరెడ్డి పంపిణీ చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే వచ్చేవరకు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేయవద్దని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. దీంతో కొద్దిసేపు ఇరుపార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

అధికారం శాశ్వతం కాదు: ఎమ్మెల్యే సునీతారెడ్డి

అధికారం శాశ్వతం కాదని రాజకీయంగా కక్ష కట్టి ప్రజలకు నష్టం కలిగించాలని చూస్తే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే సునీతారెడ్డి హెచ్చరించారు. తనను కొందరు నాయకులు ఉద్దేశపూర్వకంగా రాజకీయాలు చేస్తూ అడ్డుకునేందుకు చూస్తున్నారని ఇది సరికాదన్నారు. అధికారులు సైతం నాయకులకు వత్తాసు పలకడం మంచి పద్ధతి కాదని హితవుపలికారు.

మువ్వన్నెల రెపరెపలు

76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మెదక్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

- మెదక్ మున్సిపాలిటీ/మెదక్‌జోన్



జెండాను ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి లక్ష్మీశారద



జాతీయ జెండాకు వందనం చేస్తున్న మెదక్ మున్సిపల్ కమిషనర్ తదితరులు



జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

క్లుప్తంగా


ఆలయంలో చోరీ

నర్సాపూర్: నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న శీతల మాత ఆలయంలో శనివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయం గ్రిల్స్‌కు వేసిన తాళం పగులగొట్టి లోపలికి చేరి హుండీ తాళం ధ్వంసం చేశారు. అందులో ఉన్న డబ్బును ఎత్తుకుపోయారు. గర్భగుడి తాళం సైతం పగులగొట్టి లోపలికి వెళ్లినా అందులో ఏం ఎత్తుకెళ్లలేదని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా హుండీని ఇటీవల తెరిచి అందులో ఉన్న డబ్బును లెక్కించి ఆలయ నిర్వహణకు వినియోగించారు. అందులో తక్కువ డబ్బు ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఈవిషయమై ఎస్‌ఐ లింగంను వివరణ కోరగా తన దృష్టికి వచ్చిందని, సీసీ కెమెరాలు పరిశీలించి దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

అలాగే మరో ఇంట్లో చోరీకి యత్నించారు. పట్టణంలోని ఓ ఉద్యోగి ఇంటి తాళం పగులగొట్టి సెంటర్ లాక్ ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తుండగా చుట్టుపక్కల వారు లేవడంతో పారిపోయారు.

గుర్తుతెలియని వ్యక్తుల సంచారంతో కలకలం

ఆందోళన చెందుతున్న కాలనీ వాసులు



సీసీ కెమెరాలో రికార్డు అయిన గుర్తు తెలియని వ్యక్తి ఫొటో

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో ఆదివారం వేకువజామున కొందరు గుర్తు తెలియని వ్యక్తులు సంచరించినట్లు, ఇళ్లల్లోకి చొరబడే ప్రయత్నం చేసినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలు సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి. స్థానికులు తెలిపిన ప్రకారం శ్రీనగర్ కాలనీ రోడ్డు నెంబర్ 10లో ఓ వ్యాపారస్తుడి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఎవరో గుర్తుతెలియని వ్యక్తి ఇంటి ముందుకు వచ్చినట్లు రికార్డు అయింది. ఒక ఇంటి నుంచి మరో ఇంటిలోపలికి దూకి వచ్చినట్లు గుర్తించారు. ఇలా వేకువ జామునే ఎవరో కొందరు అనుమానాస్పద వ్యక్తులు కాలనీలో సంచరిస్తూ ఇండ్లల్లోకి రావడంపై కాలనీవాసులు, మహిళలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై స్థానిక పోలీసులు స్పందించి వెంటనే విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

బైండోవర్ ఉల్లంఘన: తండ్రీ కొడుకుకు జైలు

చిన్నశంకరంపేట(మెదక్): బైండోవర్ ఉల్లంఘనలో ఇద్దరిని జైలుకు పంపినట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు. మండలంలోని కామారం గ్రామానికి చెందిన తండ్రీ కొడుకు హలావత్ బీమా, రాజ్‌కుమార్ గతేడాది ఫిబ్రవరిలో కాపారం తండా శివారులో మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపల్లికి చెందిన ఆకుల శ్రీనివాస్ పొలంలోకి అక్రమంగా ప్రవేశించడంతో పోలీసులు కేసు నమోదు చేసి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. అయినప్పటికీ వారు పద్ధతి మార్చుకోకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరికి చెరి రూ. 2 లక్షల జరిమానా చెల్లించాలని, బైండోవర్ కాలం పూర్తయ్యే వరకు జైలు శిక్ష విధించారు. జరిమానా చెల్లించలేకపోవడంతో ఇద్దరిని అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు ఆదివారం ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వైద్యుడు మృతి

పటాన్ చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ వైద్యుడు మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా, మజీద్‌బండకు చెందిన కళ్యాణ్ వర్మ (43) వైద్యుడు శనివారం రాత్రి తన కారులో వికారాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా రామచంద్రపురం పరిధిలోని నాగులపల్లి గ్రామ సమీపంలోకి రాగానే ఆకస్మాత్తుగా అడవి పంది రోడ్డుకు అడ్డంగా రావడంతో దానిని తప్పించపోయి ఫ్లైఓవర్ సిమెంట్ గోడను ఢీకొట్టాడు. దీంతో వైద్యుడి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వీరికి పండుగ... వారికి దండగ

- నష్టాల బాటలో టమోటా
- భారీగా పడిపోయిన ధరలు
- పెట్టుబడైనా దక్కడం లేదు
- మహారాష్ట్ర నుంచి కూడా ఒకేసారి పంట
- శీతల గిడ్డంగులు లేక దెబ్బతీసిన వైనం



టమోటా సాగు చేస్తున్న రైతులకు తిప్పలు తప్పడంలేదు. వాతావరణంలో మార్పు,గిట్టుబాటు ధర లేక దిగులు చెందుతున్నారు. ప్రస్తుతం టమోటా ప్రజలకు పండుగ, రైతులకు దండగ అన్నట్లుంది. కనీసం పంటను దాచుకునేందుకు శీతల గిడ్డంగులు (కోల్డ్‌స్టోరేజీ) లేక తక్కువ ధరకే విక్రయిస్తూ రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. గతంలో కిలో వంద పలికిన టమోటా ప్రస్తుతం రూ.పదికి మించి కొనడం లేదు. రూ.వేలు పెట్టిన పెట్టుబడైనా దక్కడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జహీరాబాద్ టౌన్:

జిల్లా నేలలు, వాతావరణం టమోటా సాగుకు అనుకూలంగా ఉంది. మిగతా కూరగాయలతో పోలిస్తే టమోటా అధిక విస్తీర్ణంలో రైతులు పండిస్తున్నారు. జహీరాబాద్, నారాయణఖేడ్, మనూర్, న్యాల్‌కల్, కోహీర్, కొండాపూర్, ఝరాసంగం తదితర మండలాల్లో టమోటా అధిక విస్తీర్ణంలో సాగవుతుంది. జిల్లాలో ఈ ఏడాది 500 ఎకరాల్లో టమోటా పంట ఉంది. ఈ సంవత్సరం టమోటా నారు అందుబాటులో ఉండటం వల్ల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయి.

డిమాండ్ కన్నా మార్కెట్‌కు రెట్టింపు సంఖ్యలో సరఫరా...

జహీరాబాద్ హోల్‌సేల్ మార్కెట్‌లో టమోటా గణనీయంగా రావడంతో ధరలు బాగా పడిపోయాయి. దీనికి తోడు మహారాష్ట్రలోని షోలాపూర్, నాసిక్ తదితర ప్రాంతాల్లో రైతులు టమోటాలను విస్తారంగా సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికి అందుతుండటం ఒకేసారి అధికంగా సరఫరా కావడం వల్ల ధరలు భారీగా పతమనమయ్యాయి. జహీరాబాద్ మార్కెట్‌కు ఈ ప్రాంతంతో పాటు మహారాష్ట్ర నుంచి పదుల సంఖ్యలో బాక్స్‌లలో టమోటా వస్తుంది. డిమాండ్ కన్నా దాదాపు రెట్టింపు రావడం వల్ల ధరలు పడిపోవడానికి కారణమైంది. నెల రోజుల క్రితం కిలో రూ.20 అమ్ముడుపోయింది. ప్రస్తుతం పదిరూపాయలకు ఎవరూ కొనేందుకు ముందుకు రావడంలేదు. ధరలు తగ్గడం వల్ల వినియోగదారులకు మేలు జరిగినా రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

సాగుతో నష్టపోయా...

ఐటీఐ చేసి మహీంద్ర కర్మాగారంలో పనిచేస్తుంటి. సొంత పొలం ఉండటంతో పనిమానేసి కూరగాయలు పండిస్తున్న. ఇప్పటి వరకు మూడుసార్లు టమోటా పండించి నష్టపోయా. టమోటా పండించడం, అమ్మడం చాలా కష్టంగా ఉంది. హోల్‌సేల్ మార్కెట్‌లో 22 కిలోల బరువున్న బాక్స్ రూ.70 నుంచి రూ.100 వరకు అమ్ముడుపోతుంది. కూలీలు,ఆటో చార్జీలు, కమీషన్ పోను ఈ ధరల వల్ల బాక్స్‌కు పది రుపాయలు చేతి నుంచి కట్టాల్సివస్తుంది. ఈ ధరలు చూసి టమోటాలను పొలం వద్దనే విసిరేయాలనిపిస్తుంది.

– తెలుగు శ్రీనివాస్,రైతు, కంబాలపల్లి



ఇదెక్కడి ప్రభుత్వం..?

- ఉద్యోగులే సర్కార్ మీద కోర్టుకా..?
- గాలిలో దీపంలా రిటైర్మెంట్ బెనిఫిట్స్
- మరో కొత్త నాటకానికి సర్కార్ తెర
- ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో నిలదీస్తా
- ఎమ్మెల్యే హరీశ్‌రావు



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించిన హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఉద్యోగులు ఎదురుచూసే పరిస్థితి చాలా దురదృష్టకరం. ఈ విషయంపై బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం మీద వత్తిడి తెస్తా' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆదివారం రాత్రి సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంశం గాలిలో దీపంలా మారిందన్నారు. ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం హైకోర్టుకు వెళ్లారని, ఇప్పటికే సుమారు 300మంది కోర్టుకు వెళ్తే వడ్డీతో సహ ఆరు వారాల్లో డబ్బులు చెల్లించాలని న్యాయస్థానం ప్రభుత్వానికి సూచనలు చేసిందన్నారు. సుమారు 9 వేల మంది ఉద్యోగులు రిటైర్డ్ అయ్యారని, ఒక్కరికి డబ్బులు ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మరో నాటకం తెర మీదకు తెచ్చిందని, ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 65 ఏళ్లు అంటూ కొత్త కథ పేరిట లీకులు ఇస్తుందని విమర్శించారు. ఉద్యోగులకు డీఏ అనేది న్యాయబద్ధంగా వచ్చే హక్కుగా అభివర్ణించారు. కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగుల స్నేహ పూర్వకంగా సాగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఏసిబి కేసులు, ఉద్యోగుల వేధింపులు పెరిగాయన్నారు. ఫిబ్రవరి, మార్చిలో జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం మీద వత్తిడి తెస్తానని, అసెంబ్లీలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తానని అన్నారు.

సురభిలో తల్లీబిడ్డ సంరక్షణ స్కీం

- ఆస్పత్రిలో ఉచిత వెయ్యి డెలివరీలు పూర్తి
- వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్ హరీందర్‌రావు



హరీందర్‌రావుకు కేక్ తినిపిస్తున్న రఫీ

సిద్దిపేటఅర్బన్: గ్రామీణ ప్రాంత ప్రజలు, పేదలు సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న తల్లీబిడ్డ సంరక్షణ స్కీంను సద్వినియోగం చేసుకోవాలని సురభి వైద్యవిజ్ఞాన సంస్థ చైర్మన్ సురభి హరీందర్ రావు పిలుపునిచ్చారు. ఈ స్కీంలో భాగంగా నిర్వహించిన ఉచిత డెలివరీలు వెయ్యి పూర్తి చేసుకున్న సందర్భంగా సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో ఉన్న ఆస్పత్రిలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లీబిడ్డ సంరక్షణ స్కీంను 2022 జులైలో ప్రారంభించామన్నారు. నేటికి వెయ్యి డెలివరీలు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఏదైనా అనారోగ్య సమస్య వచ్చినా, అనుకోని ప్రమాదం జరిగినా పేద ప్రజలు భరించలేని విధంగా మెడికల్ ఖర్చులు పెరిగిపోయాయన్నారు. దానిని దృష్టిలో ఉంచుకొని పేద ప్రజలకు మెరుగైన వైద్యం తక్కువ ఖర్చులో అందించాలన్నదే తమ సంకల్పం అని అన్నారు. ఉచితంగా డెలివరీలు చేయడంతో పాటు నిరంతరం డాక్టర్ల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పేదలు, గ్రామీణ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అంతకుముందు 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా వైద్య కళాశాలలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్య విజ్ఞాన సంస్థ డైరెక్టర్ విఖ్యాత్ రావు, డీన్ మహమ్మద్ రఫీ, మెడికల్ డైరెక్టర్ రాంప్రసాద్, ప్రిన్సిపాల్ రమణకుమార్, మెడికల్ సూపరింటెండెంట్ దినేష్ సింగ్, అడిషనల్ సూపరింటెండెంట్ గోపీచందర్, డిప్యూటీ సూపరింటెండెంట్ కరుణాకర్, గైనిక్ హెచ్‌ఓడీ తొగరికర్, డాక్టర్లు శివలత, సౌజన్య, దివ్య, మనీష, పీజీ డాక్టర్లు, పీఆర్వో పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

అక్క మందలించిందని..

హల్దీవాగులో దూకి వ్యక్తి బలవన్మరణం



రవి (ఫైల్)

వర్గల్(గజ్వేల్): మద్యానికి బానిసైన వ్యక్తి.. అక్క మందలించిందని వర్గల్ మండలం నాచారం హల్దీ వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఈ ఘటన జరిగింది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోనాపూర్‌కు చెందిన ముద్దుల రవి (25) దినసరి కూలీ. ఇతనికి భార్య మంజుల అయిదేళ్లలోపు వైశాలి, అభిలాష్, ఆనంద్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. మూడేళ్ల నుంచి తన భార్యకు దూరంగా, గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్‌లోని అక్క లక్ష్మి ఇంట్లోనే ఉంటున్నాడు. కొంత కాలం నుంచి ఎలాంటి పనులు చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఉదయం మద్యం తాగి ఇంటికి రావడంతో తమ్ముడిని సోదరి లక్ష్మి మందలించింది. దీంతో తాను తన ఇంటికి వెళ్తానని చెప్పి బంగ్లా వెంకటాపూర్‌లో బస్సు ఎక్కి నాచారం వద్ద దిగాడు. అక్కడ హల్దీవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

ముగ్గురిపై హోటల్ సిబ్బంది దాడి

తీవ్రంగా గాయపడి ఒకరు మృతి



హరికృష్ణ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: హోటల్‌లో భోజనం చేయడానికి వెళ్లిన ముగ్గురిపై దాడి చేసిన ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, పోలీసులు కథనం ప్రకారం .. చైతన్యనగర్ కాలనీకి చెందిన హరికృష్ణ (48), ఈ నెల 9న రాత్రి కాలనీకి చెందిన దప్పు రాజేష్ కుమార్, నీరుడి రాజకుమార్‌లతో కలిసి డివిజన్ పరిధిలోని మేరాజ్ బావర్చి హోటల్‌కు భోజనం చేసేందుకు వెళ్లారు. భోజనం ఆర్డర్ చేశాక హోటల్ యజమాని అమీర్, అతని సిబ్బంది భోజనం లేదు.. ఏం లేదని ముగ్గురిపై దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన హరికృష్ణను చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తిరిగి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఈఎస్‌ఐ సనత్‌నగర్‌కు తరలించగా, అక్కడ పది రోజులపాటు చికిత్స అందించి, ఇంటికి పంపారు. ఇంటికి వచ్చిన హరికృష్ణ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు నిఖిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కొండపాక(గజ్వేల్): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని కోనాయిపల్లిలో వడ్డెర కులానికి చెందిన దంపతులు మమత, కనకరాజు(28)లు బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. కనకరాజు తల్లి ఎల్లవ్వ అనారోగ్యానికి గురవ్వడంతో ఇటీవల స్వగ్రామానికి వచ్చారు. కూలి పనులు చేసుకుంటూ కోనాయిపల్లిలోనే ఉందామంటూ భార్యకు చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. దీంతో భార్య మమత ఈనెల 23న ఎవరికీ చెప్పకుండా హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై అదే రోజు కనకరాజు పురుగు మందు తాగడంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మద్యం మత్తులో..



లక్ష్మీనారాయణ (ఫైల్)

పాపన్నపేట(మెదక్): మద్యం మత్తులో మంజీరా నదిలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కొడుపాక గ్రామ శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లష్కర్ లక్ష్మీనారాయణ (35) మద్యానికి బానిసగా మారాడు. ఆదివారం అతిగా మద్యం సేవించి వ్యవసాయ క్షేత్రం సమీపంలోని రుద్రపాదాల వద్ద మంజీరా నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అతడి కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం వెలికితీశారు. కాగా మృతుడికి భార్య మేఘమాల, ఇద్దరు కుమారులు, కూతురు ఉంది.

అదృశ్యమై.. శవమై తేలిన విద్యార్థి

సదాశివపేట (సంగారెడ్డి): మునిపల్లి పరిధిలోని లింగంపల్లి రెసిడెన్షియల్ హాస్టల్ నుంచి సోమవారం సాయంత్రం అదృశ్యమైన విద్యార్థి (18), ఆదివారం సదాశివపేట పరిధిలోని కొత్తచెరువులో శవమై తేలాడు. పోలీసుల కథనం ప్రకారం..లింగంపల్లి రెసిడెన్షియల్ హాస్టల్లో ఇంటర్ సెకండియర్ చదువుతున్న మహేందర్‌రెడ్డి సంక్రాంతి సెలవులకు స్వగ్రామం అనంతసాగర్‌కు వచ్చాడు. సెలవుల అనంతరం ఈనెల 20న సోమవారం కళాశాలకు వెళ్లి లగేజ్ పెట్టి హాస్టల్‌లో విద్యార్థులు ఎవరు రాలేదని ఇంటికి వస్తానని తండ్రి రామకష్టారెడ్డికి ఫోన్‌లో తెలిపారు. ఇంటికి రావద్దు అక్కడే ఉండి మంచిగా చదువుకోమని తండ్రి సూచించాడు. అదే రోజు సాయంత్రం హాస్టల్ నుంచి ఎవరికి చెప్పకుండా మహేందర్‌రెడ్డి బయటకి వచ్చాడు. హాస్టల్లో మహేందర్ రెడ్డి లేడని ఇంటికి వచ్చాడా లేదా అని హాస్టల్ సిబ్బంది సోదరుడు నరేందర్ రెడ్డికి ఫోన్‌లో సమాచారం ఇవ్వగా బంధువుల వద్ద ఇతరుల వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు.. 23న మునుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఆదివారం మధ్యాహ్నం సదాశివపేట కొత్తచెరువులో శవమై కనిపించాడు. శవాన్ని బయటకు తీసి మృతుడు మహేందర్ రెడ్డి తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు.

సత్యనారాయణ మృతికి సంతాపం

పలువురు నాయకులు, ఎమ్మెల్యేలు సంతాపం



సత్యనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు, చింతా ప్రభాకర్

పటాన్‌చెరు టౌన్: సీనియర్ పాత్రికేయులు, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం పట్టణంలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయన మృతిపట్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాజీమంత్రి హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మెదక్ ప్రజల పక్షాన పోరాడిన మహోన్నత వ్యక్తి సీనియర్ పాత్రికేయులు ఆర్.సత్యనారాయణ అని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. సత్యనారాయణ పార్థివదేహానికి హరీశ్ రావు, నీలం మధు ముదిరాజ్, టీయూడబ్ల్యూజేఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏకే.ఫైజల్ అహ్మద్ నివాళులర్పించారు. ఆయనకు నివాళులర్పించిన వారిలో మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీయూడబ్ల్యూజేఐజేయూ బండారు యాదగిరి, కార్యదర్శి విష్ణు ప్రసాద్, మల్లికార్జున్ రెడ్డి, మురళీధర్ శర్మ ,పానుగంటి కృష్ణ తదితరులు ఉన్నారు.

మానవత్వానికి ప్రోత్సాహకం

- క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తే రూ.5 వేలు నజరానా
- అందుబాటులోకి గుడ్ సమరిటన్ పథకం
- రోడ్డు ప్రమాదంలో మృత్యువాతలను తగ్గించేందుకు చర్యలు



జాతీయ రహదారిపై ఇటివల జరిగిన రోడ్డు ప్రమాదం

సంగారెడ్డి క్రైమ్: నిత్యం ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరిగి అక్కడికక్కడే కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. సకాలంలో ఆస్పత్రికి తరలించకపోవడం, వైద్య సేవలు సమయానికి అందకపోవడంతో మృత్యువాత పడుతున్న పరిస్థితులు ఉన్నాయి. ప్రమాదాలు చూసిన వారు కూడా పోలీస్ కేసులు వంటి అపోహలతో పట్టించుకోకుండా వెళ్లి పోతుంటారు. పైగా క్షతగాత్రులను వీడియో తీస్తుంటారు. దీన్ని నివారించేందుకు ప్రమాద బాధితులను వెంటనే ఆస్పత్రులకు చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం గుడ్ సమరిటన్ (ప్రాణదాత) అనే కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. రోడ్డు ప్రమాదాన్ని చూసిన వారు క్షతగాత్రులను గోల్డెన్ అవలర్‌లో ఆస్పత్రికి తరలిస్తే ఈ పథకం కింద సాయం చేసిన వారికి కింద కొంత నగదు అందజేస్తుంది. దీంతో 50 శాతం మరణాలను నివారించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తు విధానం

కేంద్రం 2021లో గుడ్ సమరిటన్ (ప్రాణదాత) పథకాన్ని తీసుకొచ్చింది. ఈ ప్రోత్సాహకం పొందాలంటే బాధితుడిని గంటలోపు ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం ఇవ్వాలి. పోలీసుల లెటర్ ప్యాడ్ పై ప్రాణదాత అంటూ పేర్కొంటూ ప్రమాదానికి సంబంధించిన వివరాలతో కాపీ ఇస్తారు. ఈ కాపీతో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు గాను రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు నగదు అందుతుంది. ఒక ఏడాదిలో ఎక్కువ మందిని కాపాడిన పది మందిని ఎంపిక చేసి రూ.లక్ష చొప్పున అందిస్తారు. గత ఏడాది జనవరి నుంచి డిసెంబర్ 31 వరకు జిల్లాలో 852 ప్రమాదాలు జరుగగా, 384 మంది చనిపోయారు. 913 మంది గాయాలపాలయ్యారు.

అవగాహన కల్పిస్తాం



రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు పౌరులు గాని, ప్రజలు గాని తమ వంతు బాధ్యతగా సహాయక చర్యలు చేపట్టాలి. ప్రజలకు గుడ్ సమరిటన్ పథకం పై విస్తృతంగా అవగాహన కల్పిస్తాం. రోడ్డు ప్రమాదం సమాచారం ఇస్తే పోలీస్ స్టేషన్, కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని గుర్తించాలి. ప్రమాదం జరిగిన వెంటనే 100 డయల్ తప్పనిసరిగా చేస్తే పోలీసులు అక్కడికి చేరుకుంటారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో బ్యానర్లు ఏర్పాటు చేస్తాం.

– రమేశ్ , పట్టణ సీఐ

ర్యాపిడో రైడర్ దుర్మరణం



లారీ కిందపడి దుర్మరణం చెందిన జగన్నాథ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో ఓ ర్యాపిడో రైడర్ దుర్మరణం చెందిన సంఘటన తెల్లాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని హఫీజ్‌పేటకు చెందిన జగన్నాథ్(35), ర్యాపిడో రైడర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగానే ఆదివారం ఉదయం తన బైక్‌పై విధులకు బయలుదేరాడు. గచ్చిబౌలి నుంచి తెల్లాపూర్‌కు వెళ్లేందు వీపీకుమార్ ర్యాపిడో బుక్ చేసుకున్నాడు. జగన్నాథ్ అతడిని ఎక్కించుకోని తెల్లాపూర్ బయలుదేరాడు. హుడాకాలనీ రోడ్డు వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో జగన్నాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున వీపీ కుమార్ గాయాలపాలయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

అల్లాదుర్గం(మెదక్): బావిలో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన అల్లాదుర్గంలో చోటు చేసుకుంది. అప్పాజీపల్లికి చెందిన రాములు (45) నడిమితండాకు చెందిన ఓ వ్యక్తి వద్ద మేకలు మేపుతున్నాడు. వారం రోజుల క్రితం పనికి వెళ్లిన రాములు కనిపించలేదు. అల్లాదుర్గం గ్రామానికి చెందిన కొంక రమేష్ వ్యవసాయ బావిలో ఆదివారం శవమై తేలాడు. మేకలు మేపుతూ బావిలో పడి మృతిచెందినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి చెప్పారు. మృతుడి అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పేర్కొన్నారు.